# పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి



డీఆర్డీవో సాయాగౌడ్‌కు వినతపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

- లేనిపక్షంలో సమ్మెకు దిగుతాం
- ప్రభుత్వానికి ఉపాధి హామీ పథకం ఉద్యోగుల హెచ్చరిక
- డీఆర్డీవోకు వినతిపత్రం అందజేత

కంఠేశ్వర్, ఏప్రిల్ 29: పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయడంతోపాటు పే స్కేల్ అమలు చేయాలని (సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) ఉపాధి హామీ ఉద్యోగులు మంగళవారం డీఆర్డీవో సాయాగౌడ్‌కు ఆయన ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది నుంచి వేతనాలు మూడు, నాలుగు నెలలు ఆలస్యంగా వస్తున్నాయని, ప్రస్తుతం ఇంకా మూడు నెలల జీతం పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయడానికి సెలవు దినాల్లో కూడా పని చేస్తున్నామని, అయినా వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు వెంటనే చెల్లించకుంటే సమ్మె చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో అకౌంట్స్ అసిస్టెంట్స్ జిల్లా సెక్రటరీ విజయ్, టెక్నికల్ అసిస్టెంట్స్ జిల్లా సెక్రటరీ నాగార్జున, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ జిల్లా ప్రెసిడెంట్ అరుణ్, జేఏసీ జిల్లా చైర్మన్ సురేశ్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29: నగరంలోని 300 క్వార్టర్స్‌లో నివసించే ఓ వివాహిత మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంధ్య(20) నిజామాబాద్ కార్పొరేషన్‌లో లేబర్‌గా పనిచేసే రాజు రెండేండ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజాము నాలుగు గంటలకు రాజు డ్యూటీకి వెళ్లాడు. ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి చూసేసరికి సంధ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పాన్‌షాప్ నిర్వాహకుడికి ఒక రోజు జైలు శిక్ష

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29: నగరంలోని మాలపల్లి ప్రాంతంలో నిర్దేశిత సమయం దాటి పాన్‌షాపు తెరిచి ఉంచిన వ్యక్తిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు ఇంతియాజ్ అహ్మద్‌ను మంగళవారం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని పోలీసులు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి..

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: డిచ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించారు. బాదావత్ మంగూలాల్, శ్రీరంగు రాము మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో మంగళవారం వారిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. వారికి మూడు రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇవ్వగా.. వారిని జైలుకు తరలించినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

## హంగర్గలో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పొతంగల్, ఏప్రిల్ 29: మండలంలోని హంగర్గలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టి రాములుకు ఇద్దరు కుమారులు. సోమవారం రాత్రి చిన్న కుమారుడు దాబాపై నిద్రించగా.. పెద్ద కుమారుడు ఒక గదిలో పడుకున్నాడు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి పెద్ద కుమారుడు నిద్రిస్తున్న గదికి గడియపెట్టి, చిన్న కుమారుడి గదిలో చోరీకి పాల్పడ్డారు. ఐదు తులాల బంగారం, రెండు తులాల వెండితోపాటు ఇంటి ఎదుట నిలిపిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కార్మికులకు మేడే సెలవు ఇవ్వాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 29: అన్ని రంగాల కార్మికులకు మేడే సెలవు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ అసిస్టెంట్ కమిసనర్ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం మేడే సెలవును రద్దు చేసిందని తెలిపారు. కార్మికుల పోటార స్ఫూర్తికి దూరంగా నెట్టివేయడానికి కుట్ర పన్నిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకన్న, రాజేశ్వర్, సాయన్న, ఇంతియాజ్, కిషన్, గంగన్న, లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గంగాధర్, సాయిబాబా పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

ఇందల్వాయి, ఏప్రిల్ 29: వారంరోజుల క్రితం ఇందల్వాయితోపాటు మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు గన్నారం ఎక్స్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్, బుస్సాపూర్, రాజన్న సిరిసిల్లలోని వెల్దుర్తి, కోనరావుపేటలో దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు. ఇద్దరు నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించగా కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు పది కేసుల్లో నిందితులుగా ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి 2 కార్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సై సందీప్, కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు.

## విద్యార్థులకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: బయోటెక్నాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న డబ్ల్యూ ప్రత్యూష, ఎం.పవన్ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. దీంతో వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు వారిని మంగళవారం అభినందించారు. ప్రత్యూష ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాంట్ జీనం రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలు చేయనున్నట్లు విభాగాధిపతి ప్రసన్నశీల తెలిపారు. పవన్ వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరిశోధనలు జరుపుతారని చెప్పారు. విద్యార్థులతోపాటు బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రసన్నశీలను వీసీ అభినందించారు.

## మ్యాట్ల పంపిణీ

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 29: సుభాష్‌నగర్‌లోని దయానంద యోగా కేంద్రంలో చిన్నారులకు నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణలో పాల్గొంటున్న చిన్నారులకు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మ్యాట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సన్నీకుమార్ మాట్లాడుతూ.. చిన్నారుల కోసం తమవంతు సాయం అందించామని తెలిపారు. రాంచందర్, మురళి పాల్గొన్నారు.

## కువైట్‌లో ఎల్లారెడ్డిపల్లి వాసి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 29: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి గోశికొండ గంగనర్సయ్య (36) కువైట్‌లో శుక్రవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. ఉపాధి కోసం కువైట్ వెళ్లిన గంగనర్సయ్య మృతిచెందడం బాధాకరమన్నారు. ఇండియన్ ఎంబసీ గంగనర్సయ్య మృతిపై విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

## బాధ్యతల స్వీకరణ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29: నిజామాబాద్ రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన యాసిర్ అరాఫత్ మెండోరా ఎస్సైగా బదిలీ అయ్యారు. జగిత్యాల జిల్లాలో వీఆర్‌లో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ ఇక్కడికి వచ్చారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై అరాఫత్‌ను నగర సీఐ శ్రీనివాస్ రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది సన్మానించి, వీడ్కోలు పలికారు.

## పహల్గాం అమరులకు నివాళి



మౌనం పాటిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి తదితరులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29: పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వారికి నిజామాబాద్ జిల్లా కోర్టులో మంగళవారం నివాళులర్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరత లక్ష్మి, జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బంది కలిసి కోర్టు హాల్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నిజామాబాద్ రెండో అదనపు జిల్లా జడ్జి టి.శ్రీనివాస్, మూడో అదనపు జిల్లా జడ్జి ఆశలత, నాల్గో అదనపు జిల్లా జడ్జి హరీశ్, సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ్, గోపీకృష్ణ, శ్రీనివాసరావు, హరికుమార్‌తోపాటు తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, పీపీ రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ఏ.సుదర్శన్, సీనియర్ న్యాయవాదులు అజార్ కిషన్ రావు, ఎర్రం గణపతి తదితరులు పాల్గొన్నారు.

**టీయూలో..**

డిచ్‌పల్లి, ఏప్రిల్ 29: మహల్గాంలో అమరులైన వారి కుటుంబాలకు టీయూ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పున్నయ్య మాట్లాడుతూ.. దేశంలో మతతత్వ దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. దేశ పర్యాటక రంగాన్ని చిన్నాభిన్నం చేయడానికి ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మామిడాల ప్రవీణ్, అసోసియేషన్ కోశాధికారి డాక్టర నాగరాజు, టీయూ బ్యాంక్ మేనేజర్ శివనారాయణ సింగ్, నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయాగౌడ్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ప్రెసిడెంట్ సురేశ్, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ పాత నాగరాజు, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ గుల్ హీ రానా, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి అభినందన



ఉన్నతాధికారులతో నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 29: జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం వారం రోజుల క్రితం దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో గంజాయితోపాటు నిందితులను పట్టుకుంది. దీంతో ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, అదనపు కమిషనర్ ఖురేషీ.. నిజామాబాద్ బృందాన్ని మంగళవారం అభినందించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ స్వప్న ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, 30కిలోల గంజాయితోపాటు వాహనాలు సీజ్ చేసి, ఐదుగురు నిందితులను అరెస్టు చేసినందుకు గాను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా అభినందించి, రూ.15వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐ స్వప్నతోపాటు ఎస్సై రామ్‌కుమార్, సిబ్బంది హమీద్, అవినాష్, విష్ణు, సుకన్య, శ్యామ్‌సుందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

రుద్రూర్, ఏప్రిల్ 29: మండల కేంద్రలో సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 26మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి మొత్తం రూ.5,700 జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

## వర్నిలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

వర్ని, ఏప్రిల్ 29: వర్నిలోని సీసీడీలో మాదాల చారిటబుల్ ట్రస్ట్, హెల్తీ స్కాలర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 250మందికి నేత్ర పరీక్షలు, షుగర్ టెస్టులు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రకళ, డాక్టర్ శ్రీధర్, ట్రస్ట్ మేనేజర్ కేఆర్‌ఎన్ ఠాగూర్, సభ్యులు పీవీ సుబ్బారావు, కే.శివరాజు, కోటేశ్వర్‌రావు, నాగేశ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తొండలో బుద్ధుడి విగ్రహావిష్కరణ

కోటగిరి, ఏప్రిల్ 29: మండలంలోని ఎత్తొండ గ్రామంలో మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాలమహానాడు నాయకుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 29: మండలంలోని జక్రాన్‌పల్లి, కొలిప్యాక్, తొర్లికొండ, బ్రాహ్మణ్‌పల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీశ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కేబుల్ చోరీ

మాక్లూర్, ఏప్రిల్ 29: మండలంలోని కల్లెడి గ్రామంలో సోమవారం రాత్రి వంద మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాక్లూర్ పోలీసులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు.

## మూఢ నమ్మకాలు వీడాలి

రెంజల్, ఏప్రిల్ 29: ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. దూపల్లి గ్రామంలో ప్రధాన కుడలి వద్ద ప్రజలకు నాటికలు, పాటల రూపంలో వివిధ అంశాలపై పోలీస్ కళా బృందం సభ్యులు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, రోడ్డు భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీడీసీ అధ్యక్షుడు చించుల బాబన్న, కళా బృందం పాల్గొన్నారు.

## న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

రెంజల్, ఏప్రిల్ 29: మండలంలోని నీలా గ్రామానికి చెందిన మహ్మద్ అనే వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ జడ్జి శేషతల్పాసాయి తీర్పు చెప్పారని ఎస్సై చంద్రమోహన్ మంగళవారం తెలిపారు. మద్యం తాగి 100కు డయల్ చేసి న్యూసెన్సు చేసిందుకు జడ్జి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

## పశువులకు టీకాలు

రెంజల్/మాక్లూర్, ఏప్రిల్29: రెంజల్ మండలంలోని పేపర్ మిల్ గ్రామంలో మంగళవారం గ్రామంలో 42 ఆవులు, 12 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి విఠల్ తెలిపారు. పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్‌లో ఆవులకు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాల వేసినట్లు మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్ పాండే తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌వో వినీత, జేవీవో కల్యాణి, వీఏ అహ్మద్‌పాషా పాల్గొన్నారు.

## 'భూ భారతి'తో భూ వివాదాల పరిష్కారం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, ఏప్రిల్ 29: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి' నూతన ఆర్‌వోఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ లయన్స్ కంటి దవాఖాన ఆడిటోరియంలో నిర్వహించిన 'భూ భారతి' అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 'భూ భారతి' చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి పంపిణీ చేశారు. సదస్సులో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, తహసీల్దార్ విఠల్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, నాయకులు మందర్న రవి, అల్లె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

**బోధన్ డంపింగ్ యార్డు పరిశీలన**

ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బోధన్ పట్టణ శివారులోని డంపింగ్ యార్డును ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి అగ్ని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆయన ఆరాతీశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ ఇంజినీర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బైరి నరేశ్

బోధన్ రూరల్, ఏప్రిల్ 29: సాలూరా మండలంలోని ఖాజాపూర్‌లో గ్రామస్తులు మంగళవారం అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన బైరి నరేశ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.

**బైరి నరేశ్‌కు పోలీసుల నోటీసులు**

బైరి నరేశ్ గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు నోటీసులు జారీ చేశామని ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. బైరి నరేశ్ గ్రామానికి వచ్చాడనే సమాచారం మేరకు బోధన్ రూరల్ ఎస్సై పోలీసు సిబ్బందితో కలిసి వచ్చి నరేశ్‌తో మాట్లాడారు. సభలు సాజావుగా సాగేలా చూడాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని సూచించారు.

## ఉగ్రదాడులకు వ్యతిరేకంగా పోరాడుదాం



బోధన్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



జన్నేపల్లిలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అఖిల పక్షం నాయకులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: దేశంలో కొనసాగుతున్న ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రమేశ్ బాబు అన్నారు. ఇటీవల కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ మంగళవారం బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు నన్నేసాబ్, సీనియర్ నాయకుడు ఎం. గంగాధరప్ప, మల్లేశ్, పోశెట్టి, కుమారస్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు. పహల్గంలో ఉగ్రదాడిని ఖండిస్తూ నవీపేట మండలంలోని జన్నేపల్లిలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. దుకాణాలు, హోటళ్లను మూసి ఉంచారు.

## జన్నేపల్లి కల్లు డిపోపై పోలీసుల దాడి

**21గ్రాముల ఆల్ప్రోజోలం స్వాధీనం**

నవీపేట,ఏప్రిల్ 29: మండలంలోని జన్నేపల్లిలో కల్లు దుకాణంపై మంగళవారం స్థానిక ఎస్సై వినయ్ తన సిబ్బందితో దాడి చేసి రామాగౌడ్‌ను అరెస్టు చేసి నిషేధిత ఆల్ప్రజోంను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం.. మాక్లూర్ మండలం చిక్లీ గ్రామానికి చెందిన భూమాగౌడ్ నవీపేట మండలం జన్నేపల్లి కల్లు డిపోను లీజుకు తీసుకొని నడిపిస్తున్నాడు. భూమాగౌడ్ ఆల్ప్రోజోలంను కల్లులో కలిపి విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు కల్లు డిపోపై దాడి చేశారు. ఆతని వద్ద 21 గ్రాముల ఆల్ప్రోజోలం పట్టుబడింది. దీనిని అతని బంధువైన రామాగౌడ్ వద్ద కొనుగోలు చేసినట్లు పోలీసులకు చెప్పాడు. తుంగినీ కల్లు దుకాణంపై దాడి చేసి రామాగౌడ్‌ను సైతం అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నిర్మల్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తేలింది. భూమాగౌడ్, రామాగౌడ్‌ను అరెస్టు చేసి రూ. 24 వేల విలువ చేసి ఆల్ప్రోజోలంను స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికై పోరాడుదాం

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: కార్మిక రంగ సమస్యల పరిష్కారానికి పోరాడదామని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బి.మల్లేశ్ కోరారు. మంగళవారం బోధన్ మున్సిపాలిటీ వాటర్‌వర్క్స్ వద్ద మేడే పోస్టర్లను కార్మికులు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో 139 ఏండ్ల క్రితం కార్మిక వర్గం పోరాటం చేసి 8 గంటల పని దినాన్ని సాధించారన్నారు. మన దేశంలో కార్మిక చట్టాల అమలులో కేంద్రం విఫలం కావడంతో పాటు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని అన్నారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, గంగాధర్, రాజు, లక్ష్మి, హనుమాండ్లు, మాజీద్, పోశెట్టి, వాహబ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయం ప్రారంభం

వేల్పూర్, ఏప్రిల్ 29: పచ్చలనడ్కుడ గ్రామంలో మంగళవారం జేడీ లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేడీ లక్ష్మీనారాయణను, ఆ ఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ కవితారెడ్డిని అడగగానే ఈ గ్రంథాలయ ఏర్పాటుకు ఆర్థికంగా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ పరీక్షల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య

మోర్తాడ్, ఏప్రిల్ 29: అనారోగ్యంతో బాధపడుతూ కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన వేముల పోశెట్టి(50) కమ్మర్‌పల్లి శివారు ప్రాంతంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరిన పోశెట్టి తిరిగి రాకపోవడంతో అతని కూతురు గంగామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం చెరువులో మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మాజీ సర్పంచును దూషించి, బెదిరించిన వ్యక్తులకు జరిమానా

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: ఎడపల్లి మండలం బాపూనగర్‌లో 2019లో సర్పంచ్‌గా విధులు నిర్వహించిన మెగావత్ సునీత, ఆమె భర్త రవిని దూషించి, బెదిరించిన కేసులో అదే గ్రామానికి చెందిన ఐదుగురికి జరిమానా విధిస్తూ మంగళవారం బోధన్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఈ.సాయిశివ తీర్పు చెప్పారు. లైజన్ అధికారి కథనం మేరకు.. బాపూనగర్ పంచాయతీ నూతనంగా ఏర్పాటు కావడంతో అధికారుల సూచనల మేరకు పంచాయతీ భవన నిర్మాణం కోసం గ్రామంలో ఉన్న స్థలాన్ని 2019 సెప్టెంబర్ 23న అప్పటి సర్పంచ్ శుభ్రం చేయిస్తున్నారు. గ్రామానికి చెందిన ఎన్.రాజశేఖర్, ఎన్.రంజిత్ కుమార్, గట్టు కిశోర్, గోక శంకర్, బెక్యం భాస్కర్ జోక్యం చేసుకొని ఈ స్థలాన్ని అంబేద్కర్ భవనం కోసం కేటాయించారని, ఇక్కడ పనులు చేయవద్దంటూ అడ్డుకొని దూషించారు. అడ్డువచ్చిన అప్పటి సర్పంచ్ భర్త రవిని బెదిరించి దాడికి యత్నించారు. ఈఘటనపై అప్పటి ఎస్సై రామానాయుడు కేసు నమోదు చేశారు. సర్పంచ్‌ను దూషించిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ. 5,500 జరిమానా చెల్లించాల్సిందిగా న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు.

## ముప్కాల్‌లో చైన్ స్నాచింగ్

ముప్కాల్, ఏప్రిల్ 29: మండల కేంద్రంలో సోమవారం రాత్రి బంగారు గొలుసు, బంగారు గుండ్లు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. మండల కేంద్రానికి చెందిన వెల్మ పెద్దరెడ్డి మనుమడి పుట్టిన రోజు వేడుకకు సోమవారం కోడిచర్ల గ్రామానికి చెందిన గుండుక మంజుల, ఏలేటి దేవాయి మరొకొందరు వచ్చారు. తిరిగి రాత్రి 9.45గంటలకు కోడిచర్లకు ఆటోలో వెళ్తున్నారు. ముప్కాల్ మర్రి చెట్టు ఆలయం దాటిన తర్వాత జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద వాహనాల రద్దీ కారణంగా ఆటో నిలిచిపోయింది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన దుండగులు బంగారు చైన్, గుండ్లు లాక్కొని పారిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I KETADI SAYULU (OLD NAME) S/O KETADI CHINNA SAYULU ,CHANGE MY NEW NAME AS **KETHADI SAYA REDDY** S/O KETADI CHINNA SAYULU H,NO:3-64, SIRPUR, MUGPAL, NIZAMABAD.

NTZ - 336011

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## వాహనదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 29: వాహనదారులు నిబంధనలు పాటించాలని బోధన్ పట్టణ, ట్రాఫిక్ సీఐలు వెంకట నారాయణ, చందర్ రాథోడ్ సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలో, శివారు ప్రాంతంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో పలువురు వాహనదారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై హబీబ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

**హెల్మెట్ ధరించాలి..**

నవీపేట, ఏప్రిల్ 29: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కపాడుకోవాలని ఎస్సై వినయ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై యాదగిరిగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

భీమ్‌గల్, ఏప్రిల్ 29: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సపాయి కార్మికులకు ప్రభుత్వ వైద్యాధికారి అజయ్ పవార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ దెబ్బ తగలకుండా వర్కర్లందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకొని తాగాలని సూచించారు. కార్మికులకు మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, మెడికల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

మోర్తాడ్, ఏప్రిల్ 29: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మూడునాలుగు రోజులుగా నీటిమట్టం నిలకడగా ఉంది. శనివారం ఎగువన కురిసన వర్షం కారణంగా ప్రాజెక్ట్‌లోకి 3742 క్యూసెక్కుల వరదరావడంతో 11.335 టీఎంసీలుగా ఉన్న నీటిమట్టం 11.545 టీఎంసీలకు పెరిగింది. ఆదివారం నుంచి వరద తగ్గిపోవడంతో నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1061 అడుగులు(11.545టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, 382 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.



వివిధ సామాజిక సేవలు నిర్వహించినందుకు 2024-25 లయనిస్టిక్ సంవత్సరానికి గానూ బోధన్ మండలం భవానీపేట్‌కు చెందిన లయన్ పల్లెంపాటి శ్రీధర్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. లయన్స్ రీజియన్ చైర్మన్‌గా ఉన్న ఆయన ఈ అవార్డును సోమవారం రాత్రి హైదరాబాద్‌లో అందుకున్నారు. - బోధన్, ఏప్రిల్ 29

## ఇసుక కుప్పలు సీజ్

భీమ్‌గల్, ఏప్రిల్ 29: మండలంలోని బెజ్జోరా గ్రామంలో మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించి సీజ్ చేశామన్నారు. సుమారు 25 ట్రాక్టర్ల ఇసుక ఉందన్నారు. దీనిని గురువారం వేలం వేస్తామన్నారు. అవసరమైనవారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల రీవెరిఫికేషన్

భీమ్‌గల్, ఏప్రిల్ 29: పల్లికొండ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల రీవెరిఫికేషన్‌ను ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారి ఇండ్లకు వెళ్లి పరిశీలించారు. తుది నివేదికను కలెక్టర్‌కు పంపుతామన్నారు. ఆయన వెంట జీపీ సెక్రెటరీ, సిబ్బంది ఉన్నారు.